## క్లుప్తంగా

### ఉపాధి కూలీలకు రూ.300 వేతనం



మాట్లాడుతున్న కార్యదర్శి, సర్పంచ్

కౌతాళం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే వారికి రోజుకు రూ.300 తగ్గకుండా కూలి వస్తుందని కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, కార్యదర్శి శివప్ప తెలిపారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధి పనులకు వెళ్లి స్థానికంగానే రూ.300 కూలి పొందవచ్చన్నారు. వలసలు పోయి ఎక్కడో పనిచేసి ఆరోగ్యాలు పాడు చేసుకోకుండా ఉన్న గ్రామంలోనే పని చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీఓ మాధవశంకర్, టీఏలు మరియ్యప్ప, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం



మృతుడి భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న బసవరాజు

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన కొండా ఈరన్న అనే వ్యక్తి అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కాంట్రాక్టర్ బసవరాజు, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.5 వేలు దహన సంస్కారాల నిమిత్తం అందజేశారు. బసవరాజు మాట్లాడుతూ గ్రామంలో నిరుపేదలు ఎలాంటి కష్టాల్లో ఉన్నా ఆదుకుంటానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తలారి ఈరన్న, భోంపల్లి చిన్నన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### భూసమస్యలు పరిష్కరిస్తాం

కౌతాళం: గ్రామాల్లో ఎలాంటి భూ సమస్యలు, భూతగాదాలు ఉన్నా వెంటనే పరిష్కరిస్తామని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అన్నారు. మంగళవారం ఉరుకుంద గ్రామంలో జరిగిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలను గ్రామసభ విన్నవిస్తే.. రెవెన్యూ అధికారులు పరిష్కరిస్తారని చెప్పారు. సమావేశంలో తహసీల్దారు మల్లికార్జునస్వామి, డిప్యూటీ తహసీల్దారు రజనీకాంత్‌రెడ్డి, వీఆర్‌ఓ పాల్గొన్నారు.

### సేవాగుణం అలవర్చుకోవాలి



విద్యార్థులకు ప్లేట్లను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయుడు నాగేంద్రకుమార్

నందవరం : విద్యార్థి దశ నుంచే సేవాగుణం అలవర్చుకోవాలని హెచ్ఎం గౌరమ్మ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కనకవీడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణితం ఉపాధ్యాయులు నాగేంద్రకుమార్ దాదాపు రూ.35 వేలు విలువచేసే 400 స్టీల్ ప్లేట్లను హెచ్ఎం ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు ప్రకాష్, శివశంకర్, రామాంజనేయులు, వెంకటేష్, రామ్, నాగరాజు, మీనాక్షి, ఈరన్న, రాజశేఖర్ పాల్గొన్నారు.

### 15న కార్తీక దీపోత్సవం

ఆదోని అర్బన్: కార్తీకమాసం సందర్భంగా ఈనెల 15న పట్టణ శివారులోని రణమండల కొండకు ఇరువైపులా దీపోత్సవ కార్యక్రమం ఉంటుందని కార్తీకమాస నిత్యసేవా సమితి అధ్యక్షుడు మింటు అగర్వాల్, సభ్యుడు రామకృష్ణ తెలిపారు.

# క్రీడలతో మానసికోల్లాసం



విద్యార్థినుల గౌరవ వందనం స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్, డీఎస్పీ తదితరులు



జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్

ఆదోని రూరల్: క్రీడలు మానసికోల్లాసానికి దోహద పడతాయని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. మంగళవారం మండిగిరి పంచాయతీ పరిధిలోని జీఎస్‌ఆర్ రెసిడెన్షియల్ హైస్కూల్ ఆధ్వర్యంలో ఆదోని జోనల్ లెవెల్ బాలికల త్రోబాల్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదోని సబ్‌కలెక్టర్ హాజరయ్యారు. ఆయనను స్కూల్ యాజమాన్యం సన్మానించారు. ఈ పోటీలను ప్రారంభించి విద్యార్థుల చేత గౌరవ వందనం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. బాలురతో సమానంగా బాలికలు కూడా క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ సోమన్న, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పేదలకు దూరమవుతున్న విద్య



పట్టణంలో చేపట్టిన భారీ ర్యాలీ

ఆదోని సెంట్రల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలను ప్రోత్సహించే విధంగా నిర్ణయాలు తీసుకుంటుండటంతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్య అందడంలేదని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు అన్నారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ 30వ జిల్లా మహాసభలను పురస్కరించుకుని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు విద్యార్థులు పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎమ్మిగనూర్ సర్కిల్, భీమాస్ కూడలి మీదుగా రెడ్డీస్ హాస్టల్స్‌కు చేరుకుంది. అక్కడ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న అధ్యక్షతన సభ ప్రారంభమయ్యింది. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో అశాస్త్రీయమైన విద్య విధానాన్ని అమలు చేస్తుందన్నారు. సామాజిక ఆర్థిక అసమానతలను దూరం చేసే విధంగా విద్యను అందించాల్సింది పోయి ప్రైవేట్, కార్పొరేట్‌లను ప్రోత్సహిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులను కేటాయించాల్సింది పోయి కేవలం 10 శాతం కేటాయించిందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా, ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి రంగన్న తదితరులు పాల్గొన్నారు.

## అధిక సాంద్రత వ్యవసాయంతో లాభాలు



మాట్లాడుతున్న సీఐసీఆర్ నోడల్ ఆఫీసర్ డా.వరలక్ష్మి

ఎమ్మిగనూరురూరల్: రైతులు అధిక సాంద్రత పద్ధతిలో పంటలు సాగు చేస్తే వచ్చే లాభాలను గుర్తించాలని సీఐసీఆర్ నోడల్ అధికారిణి డాక్టర్ వరలక్ష్మి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డా. కె.రాఘవేంద్రచౌదరి అధ్వర్యంలో అధిక సాంద్రత సాగు, క్షేత్ర దినోత్సవంపై వర్క్ షాప్ నిర్వహించారు. కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డా. కె. రాఘవేంద్రచౌదరి మాట్లాడుతూ శ్రేడ్డర్ ప్రదర్శనలో ప్రత్తి పంట తరువాత మోళ్లను భూమిలో కలియదున్నడం వలన ఆర్గానిక్ కార్బన్, సారవంతత మెరుగుపడుతుందన్నారు. సమావేశంలో కేవీకే శాస్త్రవేత్తలు నిరంజన్‌రెడ్డి, మౌనిక, క్రిస్టర్ కంపెనీ టీఎం శ్రీనివాసరెడ్డి, సుగన్య విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టీబీ వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న డాక్టర్ షేకున్ బాను

ఆదోని సెంట్రల్/టౌన్: టీబీ(క్షయ) వ్యాధిపై నిర్లక్ష్యం చేయడం తగదని డా.షేకున్ బాను, డా.మహేష్ బాబు, డా.అనిల్ సాగర్ తెలిపారు. మంగళవారం శంకర్ నగర్, ఇందిరానగర్, హవ్వన్న పేట అర్బన్ హెల్త్ సెంటర్ల ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, టీబీ వ్యాధి గ్రస్తులకు టీబీపై అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. ముఖ్యంగా దగ్గు రెండు వారాల కన్నా ఎక్కువగా ఉంటే తప్పకుండా గళ్ల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ల సలహాల మేరకు ఆరు నెలలు మందులను వాడితే వ్యాధి తప్పకుండా నయం అవుతుందన్నారు. కార్యక్రమంలో క్షయవ్యాధి సూపర్ వైజర్ (ఎంపీహెచ్ఎస్) బాబురాజు సిబ్బంది.మల్లికార్జున, భాస్కర్, సుబ్బమ్మ బాయి, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలి

కౌతాళం: కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం మండల పరిధిలోని చూడి, చిరుతపల్లి, మల్లనహట్టి, కరణి, తిప్పలదొడ్డి, కామవరం, ఉరుకుంద గ్రామాలలో ప్రజాపోరు కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. మండల కన్వీనర్ ఈరన్న, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య పాల్గొన్నారు

## అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలి

ఎమ్మిగనూరురూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని సీడీపీఓ సఫర్నీసాబేగం అన్నారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ అవరణలో టౌన్, రూరల్, గోనెగండ్ల, నందవరం మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్రాలకు ప్రీ స్కూల్ పిల్లలు తప్పనిసరిగా ఉండేల చూడాలని, డ్రెస్ కోడ్ పాటించాలని చెప్పారు. రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం: మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ ఆయాలదే పూర్తి బాధ్యత అని సీడీపీఓలు నాగమణి, భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సీడీపీఓ కార్యాలయంలో ఆయాలతో సమావేశం నిర్వహించారు.

కోసిగి: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో కార్యకర్తలు, ఆయాలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని స్త్రీశిశు సంక్షేమ శాఖ సూపర్ వైజర్ విజయకుమారి హెచ్చరించారు. మంగళవారం కోసిగిలో సెక్టార్–1 పరిధిలోని ఆయాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

# కార్యకర్తలకు అండగా వైఎస్సార్‌సీపీ



బుట్టారేణుకను సత్కరించిన సత్యారెడ్డి కుటుంబ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: కార్యకర్తలకు అన్ని విధాలుగా తమ పార్టీ అండగా వుంటుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక అన్నారు. నందవరం మండల పరిధిలోని ముగతి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ గృహసారథి సత్యారెడ్డి ఫిబ్రవరి నెలలో అనారోగ్యంతో మృతి చెందారు. పార్టీ గృహసారథుల పేరుపై వైఎస్సార్ బీమా ప్రీమియం చెల్లించడంతో ఆయన కుటుంబానికి రూ.5లక్షలు బీమా సొమ్ము మంజూరైంది. నగదు నామిని బ్యాంక్ ఖాతాకు జమ కావడంతో సత్యారెడ్డి భార్య సోమేశ్వరమ్మ, కుమారుడు హరికృష్ణ మంగళవారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లో బుట్టారేణుకను కలిసి తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేలా బీమా చేయించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌కు, ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి, ఎల్లెల్సీ మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి, పార్టీ కార్యదర్శి పేట శ్రీనివాసరెడ్డి, పానకలదిన్నె సర్పంచ్ నాగరాజు, రాఘవరెడ్డి, తారక్, ఉరుకుందప్ప, సోమనాథ్ పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



జాతీస్థాయికి ఎంపికైన ఈశ్వర్, అభిరామ్ రాజ్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణానికి చెందిన దీక్ష, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల విద్యార్థులు ఈశ్వర్, అభిరామ్‌రాజ్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఎమ్మిగనూరు ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మాబుసాహెబ్, పీఈటీ నరసింహరాజు తెలిపారు. ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో నవంబర్ 8,9,10 తేదీల్లో గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో కర్నూలు జిల్లా జట్టులో ఆడి ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

### రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ

మంత్రాలయం : గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో 8, 9, 10వ తేదీల్లో జరిగిన అండర్ 19 ఫుట్‌బాల్ క్రీడాపోటీల్లో మంత్రాలయం జెడ్పీ పాఠశాల విద్యార్థినులు రాధమ్మ, ధనశ్రీ ప్రతిభను కనబరిచారని హెచ్ఎం విటోబరావు తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో రాధమ్మ, ధనశ్రీలను అభినందించారు.

## రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి తీరని అన్యాయం

ఆదోని సెంట్రల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి తీరని నష్టం చేశారని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గేట్ ఎర్రిస్వామి అన్నారు. మంగళవారం రాష్ట్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. కేవలం బడ్జెట్లో విద్యారంగానికి 10.9 శాతం ప్రకటించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. దీన్ని బట్టి విద్యారంగంపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని తెలిపారు. జాతీయ విద్యార్థుల దినోత్సవం రోజున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థులకు తీరని నష్టం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడిచిన ఇప్పటి వరకు ఫీజురీయంబర్స్‌మెంట్, తల్లికివందనం విడుదల చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉమేష్, గోవిందు, దస్తగిరి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## కుప్పగల్ వాటర్ స్కీం తనిఖీ



వాటర్ స్కీంను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ

ఆదోని టౌన్: మండలంలోని కుప్పగల్ వాటర్ స్కీంను రూరల్ వాటర్ సప్లై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) పద్మజ మంగళవారం తనిఖీ చేశారు. వాటర్ సప్లై ఫిల్టర్‌బెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆదోని డివిజన్ పరిధిలో 24 వాటర్ స్కీంలు ఉన్నాయన్నారు. అన్నింటిలో నీటి సరఫరా జరుగుతోందని, ఎస్ఎస్ ట్యాంకులను ఫుల్‌గా నింపినట్లు తెలిపారు. ఆదోని డివిజన్‌లో జలజీవన్ మిషన్ పథకం కింద 578 పనులకు గానూ 127 పనులు పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులు ప్రాసెస్‌లో ఉన్నాయన్నారు. 294 గ్రామ పంచాయతీల పరిధిలో 72,978 మందికి కుళాయి కనెక్షన్లను ఇచ్చామని చెప్పారు. కుప్పగల్‌లో కుళాయి కనెక్షన్లు, అంగన్‌వాడీ సెంటర్, స్కూల్‌ను పరిశీలించి, వాటర్ సప్లై సరఫరా అవుతుందా లేదానని పరిశీలించినట్లు తెలిపారు. తాగునీటిని పరిశీలించగా క్లోరిన్ శాతం మెరుగ్గా ఉన్నట్లు గుర్తించామన్నారు.

### అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన

కోసిగి: మండలంలోని సాతనూరు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఐకమత్యం ఏర్పాటు చేసుకుందామని దళిత ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు ఆరెకంటి దేవదాసు, బీఎస్పీ రాష్ట్ర నాయకులు మంచాల లక్ష్మీనారాయణ, బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామతీర్థం అమరేష్, మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసప్ప పిలుపునిచ్చారు. మంగళవారం సాతనూరు గ్రామంలో ఆయా సంఘాల నాయకులు, ప్రజలతో కలిసి అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన చేపట్టారు.

### జిన్నింగ్ హమాలీల కూలి పెంచాలి

ఆదోని రూరల్: జిన్నింగ్ హమాలీల కూలి రేట్లను పెంచాలని మర్చంట్ అసోసియేషన్‌కు జిన్నింగ్ హమాలీ యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం డిమాండ్ నోటీసును అందించారు. యూనియన్ ఉపాధ్యక్షులు ఈరన్న, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, సీఐటీయూ పట్టణ సీనియర్ నాయకులు బి.మహానందరెడ్డి, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్, లక్ష్మన్న మాట్లాడుతూ జిన్నింగ్ హమాలీల కూలీ రేట్ల అగ్రిమెంట్ 09–022023 నాటికి పూర్తయ్యిందన్నారు. ఒకటిన్నర సంవత్సరం అయినా యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు.

### రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఆదోని అర్బన్/ ఎమ్మిగనూరుటౌన్ /పెద్దకడబూరు: ఈనెల 14వ తేదీ నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారులు కె.సుజాత, హరికృష్ణ, ఆశాజ్యోతి మంగళవారం తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు ఉంటాయన్నారు.

### మోడల్‌స్కూల్ హాస్టల్‌ను ప్రారంభించండి

మంత్రాలయం: రచ్చుమర్రి గ్రామ శివారులో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో హాస్టల్‌ను ప్రారంభించాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఖాజా డిమాండ్ చేశారు. మూడు నెలల క్రితం విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడంతో మిగతా విద్యార్థినులు భయంతో హాస్టల్‌కు రాలేకపోతున్నారన్నారు.

### జాబ్‌మేళాలో 48 మందికి ఉద్యోగాలు

ఎమ్మిగనూరుటౌన్: జిల్లా నైపుణ్యాభివృద్ధి ,శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 48మంది పలు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎల్అండ్‌టీ కన్‌స్ట్రక్షన్, కె.గ్రూప్‌కు చెందిన జుపిటో, స్విగ్గి సంస్థలు నిర్వహించిన జాబ్‌మేళాలో 72 మంది అభ్యర్థులు పాల్గొనగా ఆయా కంపెనీలు 48మందిని ఎంపిక చేశాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆనంద్‌రాజ్ కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి సాయితేజ పాల్గొన్నారు.

### లక్ష్మమ్మవ్వకు ప్రత్యేక పూజలు

పెద్దకడబూరు : మండల కేంద్రంలో వెలసిన పెద్ద లక్ష్మమ్మవ్వ, చిన్న లక్ష్మమ్మవ్వకు కార్తీక మాసం శుక్ల పక్షం మంగళవారం ఏకాదశిని పురస్కరించుకొని ఆలయ పూజారి విశ్వబ్రాహ్మణ నరసింహాచారి, ఈరన్నచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారిజాము నుంచి అమ్మవార్లకు జలాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ తదితర పూజలు చేపట్టారు. భక్తులు అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించారు.